కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27: కాగజ్‌నగర్ డివిజన్ ఎక్సైజ్ సీఐ శ్యాముల్ జాన్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆసిఫాబాద్ ఎక్సైజ్ సీఐ దీపక్ కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ శ్యాముల్ జాన్‌కు సస్పెండ్ పత్రం అందించి రిసీవ్ పత్రం తీసుకున్నారు. సీఐగా విధులు నిర్వర్తించిన మంగ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఖమ్మం జిల్లాలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విధులు నిర్వర్తించే శ్యాముల్ జాన్ ఫిబ్రవరి 19 కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఆయన సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడంతో రెండ్రోజుల క్రితం 'విధులకు హాజరు కాని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ' అనే కథనం 'నమస్తే తెలంగాణ దిన పత్రిక'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన ఉన్నతాధికారులు శ్యాముల్ జాన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ ఘన్‌పూర్ చెక్‌పోస్టు ఎక్సైజ్ సీఐ రవిని కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు అప్పగించారు.

రైలు నుంచి పడి ఒకరికి గాయాలు

కాసిపేట, ఏప్రిల్ 27 : కాసిపేట మండలంలోని స్టేషన్ పెద్దనపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం రైలు నుంచి పడి బిహార్‌కు చెందిన బ్రిజిలాల్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాలు పూర్తిగా విరిగి పోయి నుజ్జు నుజ్జు కాగా చేయి విరిగిపోయింది. ఇతర శరీర భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

లక్సెట్టిపేట, ఏప్రిల్ 27: లక్సెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ, బీఎడ్ కోర్సుల అర్హత పరీక్షకు ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా తెలిపారు. www.ncet.samarth.ac.in వెబ్‌సైట్‌లో గానీ కళాశాల సంప్రదించాలన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- అధికారులతో పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా
- జిల్లా వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల పరిశీలన

నస్పూర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్నఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా సూచించారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి నస్పూర్ మున్సిపాలిటీలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ఫ్యాన్లు, టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలన్నారు. పోలీసులకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో రాములు, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

బెల్లంపల్లి, ఏప్రిల్ 27 : పట్టణంలోని బజార్ ఏరియా జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి నియోజకవర్గంలో ఈవీఎం మిషన్ స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ కేంద్రాన్ని శనివారం పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు రవీష్ గుప్తా పరిశీలించారు. అదే పాఠశాలలో ఏర్పాటు చేసిన 98, 99, 100, 101 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. యువసంఘటన్ పాఠశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, సీఏస్ఐ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవికుమార్, తహసీల్దార్ కే.వై ప్రసాద్, సీఐ దేవయ్య, డిప్యూటీ తహసీల్దార్లు షేక్ హమీద్, వీ.వీ.ఆర్.కే.డీ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చెన్నూర్ రూరల్/కోటపలి/జైపూర్, ఏప్రిల్ 27 : మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను నియోజవర్గ పరిశీలకుడు రవీష్ గుప్తా పరిశీలించి పలు సూచనలు చేశారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి, మల్లంపేట పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. చెన్నూర్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రకళకు పలు సూచనలు చేశారు. జైపూర్ మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ధారవత్ చంద్రకళ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్ చెన్నూర్ సీఐ రవీందర్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

నస్పూర్, ఏప్రిల్ 27 :ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్‌గుప్తా అన్నారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములుతో కలిసి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, సీ విజిల్, వీడియో పరిశీలన, వెబ్‌కాస్టింగ్, మీడియా సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ విజిల్ కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబర్ 1950 ద్వారా అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రకటనల కోసం సువిధ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఓటు ఆవశ్యకతపై ఓటరు సెల్ఫీ పాయింట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

లోక్‌సభ ఎన్నికల్లో విధులు కేటాయించబడిన సూక్ష్మ పరిశీలకులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావేశ్ గుప్తా అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళతో కలిసి సూక్ష్మ పరిశీకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు సెగ్మెంట్లలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్‌మేనేజర్ సునీల్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

కౌటాలలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నక్క శంకర్

కౌటాల, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నక్క శంకర్ పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో చింతలమానేపల్లి మండల నాయకుడు ఉమా మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులున్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన, ఏప్రిల్ 27 : మండలంలోని 24 పంచాయతీల్లో శనివారం బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ జౌరొద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమ్మ, మహిళ మండలాధ్యక్షులు అన్నపూర్ణ అరుణ, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, నాయకులు రాజేశ్వర్ రావు, శ్రీధర్, రాజేశ్, భరద్వాజ్, రాజేశ్, పద్మ, సర్వేశ్వర్ గౌడ్, ఉబేదుల్లా ఉన్నారు.

రెబ్బెనలో వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్, బీజేపీలను నమ్మద్దు

- చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

మాట్లాడుతున్న బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 27: కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కలిసి రామకృష్ణాపూర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పెద్దలు ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లకు ఎమ్మెల్యే టికెట్లు, ఇప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వివేక్ కొడుకు టికెట్ ఇవ్వడం కుటుంబ పాలన, రాచరిక పాలన కాదా ? అని ప్రశ్నించారు. పెద్దపల్లి పార్లమెంట్ వివేక్ కుటుంబ గుత్తాధిపత్యమా, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీలో వేరే దళితులు లేరా ? అని ప్రశ్నించారు. చెన్నూర్‌కు అగ్రికల్చర్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఫ్యాక్టరీల ఏర్పాటు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల జీవోలని ఆపి పనులు నిలిపి వేశారని తెలిపారు. రూ.1658 కోట్లతో ఏర్పాటు చేయనున్న చెన్నూరు ఎత్తిపోతల పథకాన్ని నిలిపేశారని పేర్కొన్నారు. రాజకీయాల్లో నిలకడ, నిబద్ధతలేని రాజకీయ నాయకులు వివేక్ కుటుంబ సభ్యులు, చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని మాట ఇవ్వగలరా ? అని ప్రజలకు తెలుపాలన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన కార్మికుల గొంతుగా కొప్పుల ఈశ్వర్ ఢిల్లీలో పోరాడుతారని తెలిపారు. ఈశ్వర్‌ను గెలిపిస్తే ప్రజలకు లాభం... కాంగ్రెస్ పార్టీ గెలిస్తే వివేక్ కుటుంబానికి లాభం ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, నాయకులు రాజారమేశ్, మేడిపల్లి సంపత్, జే.రవీందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణి

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 27 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విదానాలను కార్మిక వర్గం మే డే స్ఫూర్తితో పోరాటాలతో తిప్పికొట్టాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పిలుపునిచ్చారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాడుతుందన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఈ నెల 28న నస్పూర్ కాలనీ నర్సయ్య భవన్‌లో ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఓసీపీలోని వివిధ యూనియన్లకు చెందిన 30 మంది నాయకులు, కార్యకర్తలు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, నాయకులు చంద్రమోహన్, దాడి రాజయ్య, అఫ్రోజ్‌ఖాన్, సత్తయ్య, మోహన్‌రెడ్డి, సతీశ్, మల్లెత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడే పోస్టర్ విడుదల

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

రెబ్బెన, ఏప్రిల్ 27: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో శనివారం మేడే పోస్టర్లను సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఆవిష్కరించినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల చట్టాలు, హక్కులు కాపాడు కోవడానికి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ బండారి తిరుపతి, అరికిళ్ల పోశం, శ్రీనివాస్, చంద్రయ్య, భీమేశ్, సంతు, స్వామి, చందు, పోసుబాయి, రాణి, సావిత్రి, నాగలక్ష్మి, శారద, మల్లీశ్వరి, శంకరమ్మ ఉన్నారు.

టెక్నాలజీపై నైపుణ్యం పెంచుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 27: ప్రస్తుత కాలంలో విద్యార్థులు టెక్నాలజీపై నైపుణ్యం పెంచుకోవాలని డీఈవో పార్శి అశోక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు బోనగిరి సతీశ్, కార్యదర్శి వేణుగోపాల్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, జిల్లా పరీక్షల సహాయాధికారి ఉదయ్ బాబు, కమిటీ సభ్యులు సంతోష్, శ్రీనివాస్, సాయికృష్ణ, దీపక్, శ్రీకాంత్, హెచ్‌ఎం కోటేశ్వరరావు ఉన్నారు.

పని స్థలాల్లో సౌకర్యాలు కల్పించాలి

కెరమెరి, ఏప్రిల్ 27: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని స్థలాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో కృష్ణారావు సూచించారు. శనివారం మండలంలోని నిషాని, గోండ్‌గూడ, సాంగ్వీ, ఖైరి, సావర్‌ఖేడ గ్రామాల్లో నర్సరీ, ఉపాధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏపీవో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కూలీలు ఉన్నారు.

ఏనుగు సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

- కోటపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి

కోటపల్లి, ఏప్రిల్ 27 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏనుగు సంచరిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కోటపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి పేర్కొన్నారు. శనివారం కోటపల్లి మండలకేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అటవీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మహారాష్ట్రలో ప్రాణహిత తీరం వెంట ఏనుగు సంచరిస్తున్నందున సరిహద్దు గ్రామాల అటవీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏనుగు వస్తే వెంటనే సమాచారమందించాలన్నారు. సరిహద్దుల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల భూమయ్య, పశువైద్యాధికారి పవన్‌కుమార్, డిప్యూటీ రేంజర్ లావణ్య పాల్గొన్నారు.

రూ.2.96 లక్షలు పట్టివేత

తాండూరు, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాండూరు మండల పరిధిలో శనివారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు పట్టుబడింది. తాండూరు ఏస్ఐ జగదీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తాండూరు మండల కేంద్రమైన ఐబీలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన శంకర్, లక్క మహేశ్ ఆధారాలు లేకుండా రూ.2,96,500 నగదును తరలిస్తూ పట్టుబడ్డారు. ఆ నగదును స్వాధీనం చేసుకొని ఎఫ్‌ఎస్‌టీ టీమ్‌కు అప్పగించి వారి నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఎన్నికల అధికారి విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది లక్ష్మణ్ ఉన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

కన్నెపల్లి, ఏప్రిల్ 27 : కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షురాలు మాధవరపు సృజన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి సగానికిపైగా అధికారులు రాకపోవడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు.

ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 27: శ్రీరాంపూర్ ఏరియాలోని గాంధీనగర్‌కు చెందిన పులి కార్తీకేయ (18) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన కార్తీకేయ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీలో భగ్గుమన్న విభేదాలు

★ ఒకరిపై కేసు నమోదు

రెబ్బెన, ఏప్రిల్ 27: కాషాయపార్టీలో అంతర్గత పోరు రచ్చకెక్కింది. నంబాలలో శనివారం చేపట్టిన ప్రచారం సందర్భంగా విబేధాలు బయటపడ్డాయి. మండలంలోని నంబాల, నారాయణపూర్ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గెడం నగేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నంబాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా అత్మారాంనాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్నాక విజయ్ మధ్య కొన్ని రోజులుగా రగులుతున్న విబేధాలు భగ్గుమన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నుంచే ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తున్నది. శనివారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. అత్మారాం నాయక్ రెబ్బెన ఠాణాలో ఫిర్యాదు చేయగా, విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

డ్రోన్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 27: రామగుండం కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలో డ్రోన్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వీవీఐపీ, వీఐపీలు హెలికాప్టర్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారని, ఈ మేరకు డ్రోన్‌లపై నిషేధం విధించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్‌లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

అర్ధరాత్రి చోరీ..నగలు, నగదు అపహరణ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27: భట్టుపల్లి గ్రామంలో తోట శోభ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు రూరల్ ఎస్ఐ సోనియా తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, తోట శోభ రాత్రి ఇంటి డాబాపై పడుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మూడు తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరించారని తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్పష్టం చేశారు.

గుప్త నిధులు తవ్విన వారిని శిక్షించాలి

జైపూర్, ఏప్రిల్ 27: మండలంలోని వేలాల గట్టు మల్లన్న దొనలో శివలింగం పక్కన గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ సుందిల్ల మల్లేశ్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం వేలాల గట్టు మల్లన్నను దర్శించుకుని తవ్వకాలు చేపట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ విషయంలో ఆలయ ఈవో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మీసాల తిరుపతి, సుందిల్ల గట్టయ్య, మీసాల రాజకుమార్, హరీశ్, జశ్వంత్, సుంకరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 27: గంజాయి కేసులో మంచిర్యాల చింతపండువాడలో ఉండే దేవనాథ్ రాయ్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోచమ్మ టెంపుల్ వద్ద దేవనాథ్ రాయ్ గంజాయి సేవిస్తుండగా పట్టుకొని విచారించారు. కలకత్తా గొన్న సాంద్రీ ఏరియా నుంచి మంచిర్యాలకు వచ్చి సమోసాలు విక్రయిస్తుంటాడు. డబ్బుల కోసం మహారాష్ట్రలో గంజాయి తెచ్చి రైల్వేస్టేషన్ సమీపంలో యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. శనివారం విక్రయించేందుకు యత్నిస్తుండగా అతనిని అదుపులోకి తీసుకొని 240 గ్రాముల గంజాయి, హుక్కాను సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎస్.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27: కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలోని మున్ని బార్ అండ్ రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు శనివారం పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి పైకప్పు తొలగించి లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న నగదు రూ.3 లక్షలు దొంగలించినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం గుర్తించిన బార్ యజమాని వేణుగోపాల్ పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత భోజనం

బెల్లంపల్లి, ఏప్రిల్ 27 : బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయంలో శనివారం పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచితంగా భోజనం అందించారు. మాజీ కౌన్సిలర్ తోడే వంశీ కృష్ణారెడ్డి స్మారకార్థం కుటుంబసభ్యులు ఎన్ఆర్ఐ తోడే వెంకటకృష్ణారెడ్డి, తల్లి తోడే పద్మారెడ్డి సహకారంతో భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి ఎన్జీవో అన్నదాత ప్రాజెక్ట్ బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధుకర్, సభ్యులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత బ్యాడ్మింటన్ శిబిరం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 27: ఈ నెల 29నుంచి మే 12 వరకు ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపా రు. మంచిర్యాలలోని రంగంపేట గ్రీన్‌సిటీలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రతిరోజూ ఉదయం 7 గం టల నుంచి 8.30 గంటల వరకు ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 9849505695, 9949942952 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల మేళా

హాజీపూర్, ఏప్రిల్ 27 : ఈ నెల 30, మే 1న జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో నిర్వహిస్తున్న సేంద్రియ ఉత్పత్తుల మేళాను విజవంతం చేయాలని హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ పూస్కూరి శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ మేళాలో ఆర్గానిక్, సేంద్రియ ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్‌పీసీ నిర్వాహకులు గోనె శ్యామ్ సుందర్ రావు, డైరెక్టర్ బొడ్డు శంకర్, బొలిశెట్టి తిరుపతి, ధర్మయ్య, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బొలిశెట్టి తిరుపతితో పాటు రైతులు పాల్గొన్నారు..

ఏకాగ్రతతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాహుల్

తాండూర్: బోయపల్లిలో పోటీ పరీక్షల అభ్యర్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

తాండూర్, ఏప్రిల్ 27 : ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులు ఏకాగ్రతతో ప్రయత్నించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బీ రాహుల్ అన్నారు. మండలంలోని బోయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ నిరుద్యోగ యువత ఒక ఇంటిని గ్రంథాలయంగా ఏర్పాటు చేసుకొని పోటీ పరీక్షలకు హాజరై ఉద్యోగాలు పొందారు. ఇంట్లో నెలకొన్న సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అవసరమైన పుస్తకాలు, కుర్చీలు, ఇతర సామగ్రిని మంజూరు చేయగా శనివారం ఎంపీడీవో పీ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత ఏకాగ్రతతో చదవాలని, చదువులో రాణించేందుకు పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటిలో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయానికి సౌకర్యాలు కల్పించిన జిల్లా అదనపు కలెక్టర్‌కు యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

దండేపల్లి, ఏప్రిల్ 25: దండేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సంధ్యారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మూడు టీంలుగా పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి వసతి, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోల్లు వేగవంతం చేయాలని సూచించారు.ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ, ఆర్ భూమన్న, రెవెన్యూ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐలు

కోటపల్లి, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శనివారం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లోని రాపనపల్లి సమీపంలో అంతరాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద వాహనాలను చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి మద్యం, డబ్బులు తరలిరాకుండా ఉండేందుకు సరిహద్దులపై 24 గంటల నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి 63 తో పాటు సరిహద్దుల్లో ఉన్న ప్రాణహిత తీరంలో పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

నస్పూర్, ఏప్రిల్ 27 : మంచిర్యాల జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పదవ తరగతిలో 634 మంది విద్యార్థులకు 527 మంది, ఇంటర్‌లో 877 మందికి 760 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

కొనుగోళ్లు లేవు..సౌకర్యాలు లేవు..

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

కన్నెపల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన నీడ, మంచినీరు తదితర సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి వారం రోజులైనా కొనడం లేదని వాపోయారు. కొనుగోలు కేంద్రంలో కనీసం మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

బస్సుల కోసం తిప్పలు..

తాండూర్ ఐబీ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తాండూర్, ఏప్రిల్ 27 : శుభకార్యాలకు వచ్చి తిరిగి వెళ్తున్న ప్రయాణికులతో పాటు, పదో తరగతి పరీక్షలు ముగిసి సెలవులు కూడా రావడంతో తమ ఊళ్లకు, బంధువుల ఇండ్లకు తలిదండ్రులతో వెళ్తున్న విద్యార్థులతో పాటు సాధారణ ప్రయాణికులతో శనివారం తాండూర్ ఐబీ రిక్వెస్ట్ బస్ స్టాప్ కిక్కిరిసింది. కానీ ప్రధాన రూట్లలో సరిపడా బస్సుల్లేక గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మరో వైపు బస్ షెల్టర్ లేక ఎండ నిలబడి ఇబ్బంది పడ్డారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899

NT-311840-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677